క్లుప్తంగా

గోమాతకు సీమంతం



భావదేవరపల్లి(నాగాయలంక): గ్రామంలోని శ్రీఅన్నపూర్ణదేవి సమేత శ్రీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో దేవస్థానం గోమాతకు సీమంతం మహోత్సవాన్ని గ్రామస్తులు ఆదివారం ఆత్మీయ పండువుగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త పూషడపు నిరంజనరావు, శివసత్యవతి దంపతుల సంరక్షణ, పెంపకంలోని గోమాతకు తొమ్మిది నెలల నూడి నిండిన సందర్భంగా బ్రహ్మశ్రీ టీ భరత్‌కుమార్ శర్మ బ్రహ్మత్వంలో వేద మంత్రోశ్చరణలతో సీమంత కార్యక్రమ పూజలు నిర్వహించారు. గువ్వాబత్తిన కేశవరావు, సీతారావమ్మ దంపతులు పీటలపై కూర్చున్నారు. గ్రామంలోని మహిళలు భక్తిశ్రద్ధలతో గోవుకు సీమంతం పూజలు చేసి హారతులిచ్చారు. మెండు సాయిరామ్, అర్జా సుధాకర్, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

31న విద్యుత్ సరఫరా నిలిపివేత

అవనిగడ్డ: నున్న – గుడివాడ ట్రాన్స్‌మిషన్ లైన్ ఆధునికీకరణలో భాగంగా ఈనెల 31వ తేదీ ఉదయం ఏడు నుంచి రాత్రి ఏడు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఈఈ ఎస్ కోటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా మచిలీపట్నం, గుడివాడ, పామర్రు, అవనిగడ్డ, చిగురుకోట ఉప కేంద్రాల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ మేరకు విద్యుత్ వినియోగదారులు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత



కోనేరుసెంటర్: పదో తరగతి విద్యార్థులు ఆత్మవిశ్వాసం, సానుకూల ఆలోచనలతో పరీక్షలకు సిద్ధం కావాలని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్ బాబు సూచించారు. బందరు మండలం భోగిరెడ్డిపల్లి గ్రామంలో ఆదివారం ఆయన పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థుల ఇళ్లకు వెళ్లి పరీక్ష సామగ్రి అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు భవిష్యత్తును నిర్దేశించుకోవడానికి మొదటి మెట్టు అని అన్నారు. పరీక్షల గురించి ఎలాంటి ఆందోళన, ఒత్తిడికి గురికాకుండా ధైర్యంగా రాయాలని సూచించారు. సమాజంలో గుర్తింపు గౌరవంతో పాటు ఉన్నత స్థానాలు అధిరోహించడానికి విద్య అత్యుత్తమ మార్గమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మద్దాల వెంకటేశ్వరరావు, బడుగు రవి తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేలపై పోలీసుల దాడి

తోట్లవల్లూరు: కోడిపందేల శిబిరంపై పోలీసులు దాడి జరిపిన ఘటన మండలంలోని దేవరపల్లి లంకలో జరిగింది. స్థానిక రాజీగడ్డ లంకలో నిర్వహిస్తున్న కోడిపందేలపై ఎస్‌ఐ అవినాశ్ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం దాడి జరిపారు. ఈ దాడిలో 15 మంది పందెం రాయుళ్లను అదుపులోకి తీసుకోవడంతోపాటు రూ. 8,900, మూడు కోడిపుంజులు, ఐదు మోటారు వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆలయాల అభివృద్ధికి రూ.50వేల విరాళం



గుడ్లవల్లేరు: స్థానిక శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయం, స్థానిక శ్రీ గంగానమ్మ ఆలయాల అభివృద్ధి పనులకు రూ.50వేలను దాతలు చాపరాల రాజేష్, మౌనిక దంపతుల కుమార్తె చాపరాల ధృతి అందజేశారు. ఆదివారం ఈ విరాళాన్ని గుడ్లవల్లేరు ఎస్‌ఈఆర్‌ఎం విద్యా సంస్థల చైర్మన్ వల్లభనేని వెంకట్రావు, నెహ్రూ పశువుల సంత కమిటీ అధ్యక్షుడు వల్లభనేని సుబ్బారావు, కార్యదర్శి ఈడ్పుగంటి ఉమా, లయన్స్ మాజీ చైర్మన్ పోలవరపు వెంకట్రావుకు దాతలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు కొప్పురావూరి రవి, మురాల నరేష్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న పుట్టలాంబ ఉత్సవాలు

గుడివాడ టౌన్: నందివాడ మండలం జనార్దనపురంలో వేంచేసియున్న శ్రీ రేణుకా పుట్టలాంబ అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తి శ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఆదివారం అమ్మవారికి అభిషేకాలు గావించి పుష్పాలంకరణ చేశారు. ఇందులో భాగంగా సామూహిక కుంకుమ పూజలు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా కూచిపూడికి చెందిన నటరాజ కళాశాల బృందం జానపద నృత్యాలు ప్రదర్శించారు.

అమరజీవి త్యాగశీలత అజరామరం

ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు

నాగాయలంక: గ్రామంలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరీ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను మండల ఆర్యవైశ్య సంఘం, వాసవీ సేవాదళ్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత నాగాయలంక ఎస్‌ఐ కలిదిండి రాజేష్ పొట్టి శ్రీరాములు, గాంధీజీ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ నాటి ఆంధ్ర రాష్ట్ర సాధనలో అమరజీవి త్యాగశీలతను కొనియాడారు. ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించి అమరజీవి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం సేవాదళ్ ఆర్థిక సౌజన్యంతో బాటసారులకు 200లీటర్లు మజ్జిగ, 10కిలోల లడ్డూ పంపిణీ చేశారు. శ్రీకన్యకా పరమేశ్వరీ దేవస్థానం కమిటీ చైర్మన్ చిట్టా సాంబశివరావు, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చిట్టా శివనాగేశ్వరరావు, ఇరిగేషన్ ఏఈ పీ రవితేజ, దేసు సత్యనారాయణ, గాదంశెట్టి శివయ్య, చిట్టా అన్నపూర్ణయ్య, వంకాయల ఆదిరాజేష్, సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

పెడన: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను ఆదివారం పలు చోట్ల ఘనంగా నిర్వహించారు. పెడన పురపాలక సంఘ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి మున్సిపల్ రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ పీ వెంకటేశ్వరరావుతో పాటు పలువురు సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే పట్టణ ఆర్యవైశ్య సంఘం, మండల ఆర్యవైశ్య సంఘం, శ్రీ వాసవి మహిళా మండలి, వాసవి క్లబ్ పొట్టి శ్రీరాములు తదితర స్వచ్ఛంద సేవా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో అమరజీవి జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వాసవి ప్రార్థన మందిరంలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి, పాత కూరగాయల మార్కెట్ దగ్గర ఉన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కొల్లూరి చిన్నా మాట్లాడుతూ ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం పొట్టి శ్రీరాములు 58 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేశారని తెలిపారు. ఆయన ఆత్మబలిదానంతో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రంతో పాటు దేశంలో భాషా రాష్ట్రాల ప్రయత్నం ఏర్పడ్డాయన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజల గుండెల్లో పొట్టి శ్రీరాములు చిరస్మరణీయులని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆర్గనైజింగ్ కార్యదర్శి కొల్లూరి రాజా, సభ్యులు కొల్లూరి భాస్కర్, భవిరిశెట్టి రాఘవరావు, సబ్బిశెట్టి ఓంకార్, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దేసు శ్రీనివాస్, శ్రీ వాసవి మహిళా మండలి గౌరవ సలహాదారులు కొల్లూరి మంజులత, ప్రధాన కార్యదర్శి మామిడి సావిత్రి, కార్యవర్గ సభ్యురాలు తమ్మన సుశీల, వాసవి క్లబ్ పొట్టి శ్రీరాములు పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ కొల్లూరి పద్మ తదితరులు పాల్గొన్నారు.



నాగాయలంకలో పొట్టిశ్రీరాములు విగ్రహానికి నివాళులర్పించిన ఎస్‌ఐ రాజేష్, ఆర్యవైశ్య సంఘ నాయకులు



నాగాయలంక సెంటర్‌లో మజ్జిగ పంపిణీ

పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిది

మచిలీపట్నంటౌన్: అమరజీవి పొట్టి శ్రీరాములు ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు కోసం తన జీవితాన్ని అర్పించిన మహనీయుడని, ఆయన త్యాగం మరువలేనిదని రాష్ట్ర గనులు భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆదివారం నగరంలోని జిల్లా కోర్టు సెంటర్‌లోని శ్రీరాములు విగ్రహానికి మంత్రి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు మాట్లాడుతూ ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఆయన సాధించిన త్యాగ ఫలాలను ఈ రోజు తెలుగు వారందరూ అనుభవిస్తున్నారని, అటువంటి మహనీయుడిని తెలుగు ప్రజలందరూ గుర్తుపెట్టుకుని ఘనంగా నివాళులర్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, కూటమి నాయకులు బండి రామకృష్ణ, కొనకళ్ల జగన్నాథరావు(బుల్లయ్య) తదితరులు పాల్గొన్నారు.



పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పెడన మున్సిపల్ ఉద్యోగులు



పెడనలో పాతకూరగాయాల మార్కెట్ వద్ద పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘ నాయకులు

మచిలీపట్నం నగర అభివృద్ధే లక్ష్యం

మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నగర అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర గనులు భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావుతో కలిసి ఆదివారం ఆయన నగరంలోని 19వ డివిజన్‌లో రూ. 14.48 లక్షల విలువైన సీఎస్‌ఆర్ నిధులతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఆ డివిజన్‌లో రూ. 5.70 లక్షలతో పైలాన్ పార్కుకు ప్రహరీ, పార్కులో రూ. 8.78 లక్షలతో వాకింగ్ ట్రాక్ నిర్మాణం పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వేగంగా పార్కు సుందరీకరణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రాజకీయాలకతీతంగా పాలకవర్గ సభ్యులు నగర అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కూటమి నాయకులు బండి రామకృష్ణ, కొనకళ్ల జగన్నాథరావు (బుల్లయ్య), జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, మున్సిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.



పైలాన్ పార్కులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

మున్సిపల్ కార్యాలయ ప్రాంతం పరిశీలన

కార్పొరేషన్ పరిధిలోని 19వ డివిజన్‌లో పాత రైల్వే స్టేషన్ ఎదురుగా అసంపూర్తిగా నిలిచిపోయిన మున్సిపల్ కార్యాలయ ప్రాంతాన్ని మంత్రి పరిశీలించారు. మున్సిపల్ నూతన కార్యాలయ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేస్తామని ఆయన తెలిపారు. మచిలీపట్నం నగర పరిధిలో ఉన్న మున్సిపాలిటీకి చెందిన భూములను ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామి పద్ధతిలో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించామని పేర్కొన్నారు.

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

అవనిగడ్డ: అవనిగడ్డ నియోజకవర్గంలో పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం చేశారు. సోమవారం నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు ఆరు మండలాల్లో మొత్తం 19 కేంద్రాలను ఏర్పాటు చేశారు. 2,314 మంది పరీక్షలకు హాజరు కానున్నారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 వరకు పరీక్షలు జరగనున్నాయి. పరీక్ష కేంద్రాల్లో పనిచేసే ఉపాధ్యాయులకు ఆదివారం ప్రత్యేక శిక్షణ ఇచ్చారు.

మోపిదేవి: మండలంలో పదో తరగతి పరీక్షలకు మూడు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ కే దుర్గాసాగర్ తెలిపారు. మోపిదేవి జెడ్పీ హైస్కూల్‌లో 177 మంది, మహాత్మా జ్యోతిభా పూలే గురుకుల పాఠశాలలో 112 మంది, పెదకళ్లేపల్లి జెడ్పీ హైస్కూల్‌లో 73 మంది విద్యార్థులు మొత్తం 362 మంది పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు.

నాగాయలంక: మండలంలో సోమవారం నుంచి నిర్వహించే పదో తరగతి పరీక్షలకు 402మంది హాజరు కానున్నట్లు ఎంఈఓ టీవీఎం రామదాసు ఆదివారం తెలిపారు. మండల పరిధిలో స్థానిక జెడ్పీ హైస్కూల్ ప్లస్‌లో నాగాయలంక–ఏలో 160 మంది, నాగాయలంక–బీలో 144, తలగడదీవి జెడ్పీ హైస్కూల్‌లో 98మంది పరీక్షలకు హాజరుకానున్నారు.

పెడన: మండలం నుంచి పదో తరగతి పరీక్షలకు మొత్తం 597 మంది హాజరుకానున్నారు. వీరితో పాటు సార్వత్రిక విద్యాపీఠం(ఓపెన్ స్కూల్) టెన్త్ పరీక్షలు కూడా నిర్వహించనున్న నేపథ్యంలో 240 మంది హాజరుకానున్నారు. పెడన మండలంలో ఐదు పరీక్ష కేంద్రాలు, ఓపెన్ స్కూల్ పరీక్షలకు నాలుగు కేంద్రాలను ఏర్పాటు చేశారు.



మోపిదేవిలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న చీఫ్ సూపరిటెండెంట్ సుధారాణి

చల్లపల్లిలో నాలుగు పరీక్ష కేంద్రాలు

చల్లపల్లి: చల్లపల్లి మండలంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు మొత్తం 780 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. చల్లపల్లి మండలంలో మొత్తం నాలుగు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. చల్లపల్లిలో ఎస్ఆర్‌వైఎస్‌పీ హైస్కూల్లో ఏ, బీ రెండు సెంటర్లు, విజయ హైస్కూల్లో ఒకటి, మాజేరు జెడ్పీ హైస్కూల్‌లో మరొక పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఎస్ఆర్‌వైఎస్‌పీ(ఏ)లో 240 మంది, ఎస్ఆర్‌వైఎస్‌పీ(బీ)లో 240, విజయ హైస్కూల్లో 235, మాజేరులో 65 మంది పరీక్షలకు హాజరు కానున్నారు.

కలంకారికి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు

పెడన: నేడు కలంకారికి దేశ నలుమూలల నుంచే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు వచ్చిందని మాజీ ఐఏఎస్ కే ప్రభాకరరెడ్డి పేర్కొన్నారు. పెడనలో 1970కి ముందు చేనేత, వ్యవసాయం పైనే ఆధారపడుతున్న వారికి కొత్తగా కలంకారి పరిశ్రమను తీసుకువచ్చి ఉపాధి కల్పించిన ఘనత పిచ్చుక వీరసుబ్బయ్య, దుర్గాంబలదేనని అన్నారు. శ్యామలా ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ పరిశ్రమలో వైఎస్సార్ లైఫ్ ఏచీవ్‌మెంట్ అవార్డు గ్రహీత పిచ్చుక శ్రీనివాసరావు తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం వారి విగ్రహాలను తయారు చేసి మ్యూజియంలో పెట్టడానికి ఏర్పాటు చేశారు. ఈ విగ్రహాలను మాజీ ఐఏఎస్ అధికారి ప్రభాకరరెడ్డి, మచిలీపట్నం మాజీ ఎంపీ బాడిగ రామకృష్ణ, హేమలత దంపతులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం పిచ్చుక శ్రీనివాసరావు తన తండ్రి హయాంలో పనిచేసిన వర్కర్లను సత్కరించారు. కార్యక్రమంలో జాతీయ అవార్డు గ్రహీతలు, బ్లాక్ ప్రింట్ మేకర్స్ కొండ్రు గంగాధర్, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.



విగ్రహాలను ఆవిష్కరించిన మాజీ ఐఏఎస్ ప్రభాకరరెడ్డి, మాజీ ఎంపీ రామకృష్ణ తదితరులు

దేవాంగ సత్రాన్ని సద్వినియోగించుకోండి

గూడూరు: తిరుమల తిరుపతిలో ఆంధ్రప్రదేశ్ దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన శ్రీ శ్రీనివాస ఉమారామలింగేశ్వర నిత్యాన్నదాన దేవాంగ సత్రాన్ని దేవాంగ సోదరులు సద్వినియోగించుకోవాలని ఆ సంఘం చేనేత విభాగం కోశాధికారి మేడక విశ్వేశ్వరరావు కోరారు. గూడూరు మండలం కప్పలదొడ్డిలో ఆదివారం దేవాంగ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి బస్టాండ్, రైల్వేస్టేషన్లకు సమాన దూరంలో 0.93 సెంట్ల సువిశాల ప్రదేశంలో 102 గదులతో సత్రాన్ని నిర్మించినట్లు తెలిపారు. ఈనెల 14వ తేదీన సత్రాన్ని ప్రారంభించడం జరిగిందని వెల్లడించారు. పరిసర ప్రాంతాల నుంచి వెళ్లే దేవాంగులు సంక్షేమ సంఘ ప్రతినిధుల సిఫార్సు లేఖలతో వెళ్తే నామమాత్రపు అద్దెకే గదుల కేటాయింపు జరుగుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచి యక్కల మాధవి, యక్కల నాగరాజు, బూసం సాయిబాబు, బూసం తాతారావు, పేరిశెట్టి బాబూరావు, మేడక మోక్షం, ఉమ్మిటి నాగశ్యామలరావు, బూసం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



నాగాయలంకలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు



చల్లపల్లిలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు

నాగాయలంక: సుదర్శి మానవత సేవాసంస్థ అందిస్తున్న నేత్ర సేవలు ఆదర్శనీయమని పలువురు అభినందించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర కంటి ఆసుపత్రి(పెదకాకాని) సహకారంతో పారిశ్రామికవేత్త బొబ్బా గోవర్ధన్ ఆర్థిక సౌజన్యంతో సుదర్శి మానవత సేవాసంస్థ ఆధ్వర్యాన ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక మారుతీ విద్యానికేతన్ డిజిటల్ స్కూల్ ప్రాంగణంలో జరిగిన శిబిరంలో 87మందికి డాక్టర్ అరుణ్ చంద్ర పరీక్షలు చేశారు. వీరిలో 54 వృద్ధులను ఐఓఎల్ ఆపరేషన్‌కు శంకర కంటి ఆసుపత్రికి పంపించారు. సంస్థ నిర్వాహకులు తలశిల రఘుశేఖర్, కనిగంటి వెంకటనారాయణ, ఆసుపత్రి క్యాంప్ ఇన్‌చార్జి గంగాధర్, జమీలా మస్తాన్, మత్తి శివ తదితరులు పాల్గొన్నారు.

చల్లపల్లి: వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 50 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి 30 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. స్థానిక వాసవీ క్లబ్ కార్యాలయంలో రామ్మోహనరావు కుటుంబ సభ్యుల సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో కంటి డాక్టర్ మోహనరావు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమాన్ని క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మాజేటి అమరవాణి, గోళ్ల వెంకటరత్నం, కోశాధికారి జూపూడి కిరణ్, సభ్యులు దింటకుర్తి జ్యోతి, జయలక్ష్మి, చైతన్య, ప్రసాద్, గణపతి, నరేంద్ర పాల్గొన్నారు.

వీరమ్మ తల్లిది ఘన చరిత్ర



గుడ్లవల్లేరు: మామిడికోళ్ల వీరమ్మ తల్లి అమ్మవారిది 115ఏళ్ల చరిత్ర అని వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ స్టేట్ మాజీ కన్వీనర్, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది చిత్తర్వు నాగేశ్వరరావు అన్నారు. నూతనంగా నిర్మించిన శ్రీ వీరమ్మ తల్లి ఆలయంలో అమ్మవారి పునః ప్రతిష్ఠ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం చిత్తర్వు బాలాలయంలో అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ వంశ పారంపర్య నిర్వాహకుడు మండా రాంబాబు, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు జెట్టి శ్రీరాం, చావా నాగేశ్వరరావు, కూసం హనుమప్రసాద్, తోట ఈశ్వరరావు, వెంకటేశ్వరరావు, నరేంద్ర, మల్లికార్జునరావు, చిత్తర్వు కౌశిక్, చావా సుభాష్ పాల్గొన్నారు.

పేర్ని నానిని కలిసిన గూడూరు వైఎస్సార్ సీపీ నాయకులు

కోనేరుసెంటర్: పెడన నియోజకవర్గం గూడూరు మండల వైఎస్సార్ సీపీ నాయకులు మాజీ మంత్రి, కృష్ణాజిల్లా పార్టీ అధ్యక్షుడు పేర్ని వెంకటరామయ్య (నాని)ని ఆదివారం పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెడన నియోజకవర్గంలోని గూడూరు మండలంలో పలువురిని పార్టీ పదవుల్లో నియమించారు. ఈ నేపథ్యంలో సదరు నాయకులు పేర్ని నానిని కలిసి కృతజ్ఞతలను తెలియజేశారు. ఈ సందర్భంగా పేర్ని వారిని అభినందిస్తూ రాబోయే రోజుల్లో పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలని సూచించారు. కూటమి అరాచకాలు, అన్యాయాలను ప్రజలకు తెలిసేలా పోరాటాలు చేయాలని సూచించారు. పేర్నిని కలిసిన వారిలో జిల్లా వైఎస్సార్ సీపీ జనరల్ సెక్రెటరీ గౌరిపర్తి రవికుమార్, జిల్లా కమిటీ సెక్రటరీ యాక్టివిటీ పెండి వెంకన్నబాబు, గూడూరు మండల అధ్యక్షుడు సమ్మెట జయవర్ధన్ ఉన్నారు.



పేర్ని నానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్న గూడూరు వైఎస్సార్ సీపీ నాయకులు

రామును కలిసిన వైఎస్సార్ సీపీ నాయకులు

పెడన: వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఉప్పాల రమేష్(రాము)ను బంటుమిల్లి మండలానికి చెందిన పార్టీ నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. మండల పరిధిలోని కూడూరు గ్రామంలోని రాము నివాసంలో వారు కలిసి పార్టీ స్థితిగతులను వివరించారు. ఇటీవల మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పెడన నియోజకవర్గంలో పార్టీ అనుబంధ శాఖలకు పలువురిని నూతనంగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ పదవులు అందుకున్న నాయకులు రామును దుశ్శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. సత్కరించిన వారిలో కృష్ణాజిల్లా రైతు విభాగం కన్వీనర్ తిరుమాని శ్రీనివాసరావు, బంటుమిల్లి మండలం పార్టీ అధ్యక్షుడు ముత్యాల నాగేశ్వరరావు, టీచర్స్ మైనార్టీ కన్వీనర్ కారె మహంతి ప్రసాద్, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి బండారు చంద్రశేఖర్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కొప్పర్తి సుబ్బారావు తదితరులు ఉన్నారు.



రామును సత్కరిస్తున్న బంటుమిల్లి వైఎస్సార్ సీపీ నాయకులు

సత్యదేవుని ఆలయ జీర్ణోద్ధరణ పూజలు

గుడ్లవల్లేరు: స్థానిక శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయ జీర్ణోద్ధరణ పూజలను రెండో రోజు ఆదివారం వేద పండితులు కొనసాగించారు. ఈ పూజల్లో గుడ్లవల్లేరు ఎస్‌ఈఆర్‌ఎం విద్యా సంస్థల చైర్మన్ వల్లభనేని వెంకట్రావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కొసరాజు బాపయ్య చౌదరి, నెహ్రూ పశువుల సంత కమిటీ అధ్యక్షుడు వల్లభనేని సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న ప్రముఖులు, మహిళా భక్తులు

విదేశీ వ్యామోహంలో యువత

గుడ్లవల్లేరు: యువత విదేశీ వ్యామోహంలో ఉందని విజయవాడ దూరదర్శన్‌కు చెందిన ప్రసార భారతి కేంద్ర ప్రాంతీయ వార్తా విభాగాధిపతి, ఉప సంచాలకులు డాక్టర్ జి.కొండలరావు అన్నారు. మండలంలోని సింగలూరుకు ఆదివారం విచ్చేసిన ఆయన్ను గ్రామస్తులు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన దేశంలో చదువుకున్న వారంతా విదేశాల వైపు మొగ్గు చూపుతున్నారన్నారు. అయితే బాపూజీ పల్లెలే దేశానికి పట్టు కొమ్మలన్న సంకల్పాన్ని ప్రముఖ సంఘ సేవకుడు డాక్టర్ బండారు శ్యామ్‌కుమార్ నిజం చేశారన్నారు.

గుడ్లవల్లేరు: సింగలూరు గ్రామాభివృద్ధి అందరికీ స్ఫూర్తి అని విజయవాడ దూరదర్శన్‌కు చెందిన ప్రసార భారతి కేంద్ర ప్రాంతీయ వార్తా విభాగాధిపతి, ఉప సంచాలకులు డాక్టర్ జి.కొండలరావు అన్నారు. కుల, మత, రాజకీయాలకతీతంగా స్వామి వివేకానంద స్ఫూర్తితో గ్రామానికి అన్ని హంగులతో అభివృద్ధి చేయటం ప్రముఖ సంఘ సేవకుడు డాక్టర్ బండారు శ్యామ్‌కుమార్, సరస్వతి దంపతులకే సాధ్యమైందన్నారు. సింగలూరులో ఆయన ఆదివారం పర్యటించి డాక్టర్ బండారు దత్తత తీసుకున్నాక గ్రామంలో జరిగిన అభివృద్ధి పనులను పరిశీలించారు. విస్తరాకుల పరిశ్రమకు చెందిన నూతన కుట్టు మిషన్లను ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు. తొలుత వివేకానందుని విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. సాయి విద్యానికేతన్ అధినేత శింగంశెట్టి ఆదినారాయణ, జీఈసీ సూపరింటెండెంట్ గద్దె సోమరాజు, ఉప సర్పంచ్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



కుట్టు మిషన్లను ప్రారంభిస్తున్న డాక్టర్ కొండలరావు

మట్టి తవ్వకాలపై ఆగ్రహం



తోట్లవల్లూరు: భద్రిరాజుపాలెం బీసీ సొసైటీలో బుసక, మట్టి తవ్వకాలపై సొసైటీ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై బుసక, మట్టి తవ్విన ప్రదేశాన్ని సొసైటీ సభ్యులు ఆదివారం పరిశీలించి ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ సొసైటీలో తమకు తెలియకుండా శనివారం రాత్రి బుసక, మట్టి తవ్వకాలు నిర్వహించారని సొసైటీ ప్రతినిధి చాగంటిపాటి వెంకట సుబ్బారావు ఆరోపించారు. తమ భూముల్లో తవ్వకాలు జరిపిన అక్రమార్కులపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీ సొసైటీ సభ్యులు ఎం. కోటేశ్వరరావు, సాంబశివరావు, ఎం.రామలింగం, శివరామకృష్ణ, పి. శివరామయ్య పాల్గొన్నారు.